ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక


సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 283 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 19 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# సింగపూర్‌లో రెండో రోజు సీఎం రేవంత్

## రూ.3500 కోట్ల ఒప్పందాలపై సంతకాలు




**హైదరాబాద్, జనవరి 18 (ప్రభాత ఉదయం):** ప్రస్తుతం హైటెక్ సిటీలో డేటా సెంటర్ నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటు ద్వారా తమ కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. సంస్థ లక్ష్యంగా దశాబ్దంలో 1 గిగావాట్ సామర్థ్యంతో విస్తరణ చేయాలని భావిస్తోంది. ఈ కాలంలో సుమారు రూ. 26,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అంచనా.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన రెండో రోజు విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో ST Telemedia Global Data Center (STT GDC) సంస్థ తెలంగాణలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మీరాన్ పేట, ముచ్చర్ల సమీపంలో 100 మెగావాట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విస్తరణ సౌకర్యంతో పాటు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఒకటిగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, STT గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బ్రూనో లోపెజ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతిశీల విధానాలు, ప్రభుత్వం అందించే సహకారం, ఆధునిక మౌలిక సదుపాయాలు సాంకేతిక ఆవిష్కరణలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రపంచ డేటా సెంటర్ల రాజధానిగా అవతరిస్తోందని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులపై ఆసక్తి చూపిన STT GDC సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. IT శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా AI ఆధారిత రంగంలో వస్తున్న మార్పుల్లో హైదరాబాద్ కీలక పాత్ర పోషించగలదని ధీమా వ్యక్తం చేశారు. STT GDC సంస్థ ప్రస్తుతం హైటెక్ సిటీలో డేటా సెంటర్ నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటు ద్వారా తమ కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. సంస్థ లక్ష్యంగా దశాబ్దంలో 1 గిగావాట్ సామర్థ్యంతో విస్తరణ చేయాలని భావిస్తోంది. ఈ కాలంలో సుమారు రూ. 26,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అంచనా. తెలంగాణలో ఏర్పాటు కానున్న ఈ అత్యాధునిక డేటా సెంటర్ రాష్ట్ర మౌలిక సదుపాయాలను కొత్త మెరుగులకు తీసుకెళ్తూ, ప్రపంచ డేటా హబ్‌గా హైదరాబాద్‌ను గుర్తింపును సాధించేందుకు తోడ్పడనుంది.



# 65 లక్షల మందికి ఆస్తిహక్కు కార్డులు

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ

### ఆస్తి హక్కులతో భరోసా వస్తుందన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జనవరి18(ప్రభాత ఉదయం):** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సుమారు 65 లక్షల ఆస్తి హక్కు కార్డులు పంపిణీ చేశారు. అవి ఆర్థిక కార్యకలాపాలను పెంపొందిస్తాయని, దారిద్య నిర్మూలనకు దోహదం చేస్తాయని ప్రధాని మోడి ప్రకటించారు. ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా లబ్దిదారులు కొంత మందితో మాట్లాడారు. ఈ పథకం రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి తోడ్పడుతుందని ఆయన చెప్పారు. పది రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరామ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలోని 50 వేల పైచిలుకు గ్రామాల్లో లబ్దిదారులకు ఈ ఆస్తి కార్డులు పంపిణీ చేశారు.'శనివారం 65 లక్షల కార్డుల పంపిణీ దృష్టా గ్రామాల్లోని సుమారు 2.24 కోట్ల మంది లబ్దిదారుల వద్ద ఇప్పుడు స్వమిత్వ ఆస్తి కార్డులు ఉంటాయి' అని ప్రధాని తెలిపారు. 'ఆస్తి హక్కులు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాల్. కొన్ని ఏళ్ల క్రితం ఐక్యరాజ్య సమితి (యుఎన్) ఒక సర్వే నిర్వహించింది. పలు దేశాల్లో ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు జనం వద్ద లేవని ఆ సర్వే వెల్లడించింది. దారిద్య్ర నిర్మూలనకు ఆస్తి హక్కులు ముఖ్యం అని యుఎన్ స్పష్టం చేసింది' అని మోడీ తెలియజేశారు. గ్రామాల్లో ఆస్తి ఒక 'వ్యర్థ మూలధనం' అని, దానితో ప్రజలు ఏమీ చేయలేరని, వారి ఆదాయం పెంపునకు అది తోడ్పడదని ప్రముఖ ఆర్థికవేత్త ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారని ప్రధాని చెప్పారు. 'భారత్‌పై ఈ సవాల్ ప్రభావం పడింది. గ్రామాల్లో ప్రజల వద్ద లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తి ఉంది, కానీ వారి వద్ద ఆ ఆస్తి పత్రాలు లేవు. వివాదాలు ఉన్నాయి, ఆస్తులు లాక్కున్నారు,

..మిగతా 2లో



## ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి హత్యాచార కేసు

### సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చిన కోర్టు

**కోల్‌కతా, జనవరి 18 (ప్రభాత ఉదయం):** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో కోల్‌కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీ కర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారిస్తోంది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరినుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇదిలా ఉంటే.. తీర్పు నేపథ్యంలో కోర్టు వద్ద భారీగా భద్రతాసిబ్బందిని మోహరించారు.

# ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి



### వీధిలైట్ల నిర్వహణకు నిధుల కొరత

### లోకల్ బాడీలో మాది ఒంటరి పోరాటమే

### బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జనవరి18(ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఏడు నెలలుగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని వీధిలైట్ల నిర్వహణకు నిధుల కొరత ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేస్తే.. అదే విధానాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోందని విమర్శించారు. చెరువుల కబ్జాను అరికట్టే చట్టం గతంలో కూడా ఉందని.. పాత చట్టానికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అని పేరు పెట్టిందన్నారు. మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుందని.. అది తమ బాధ్యత అని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క భాజపాకు మాత్రమే ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీపై కేంద్ర మంత్రి, టీ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామకంపైన కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా ఎంపిక కావాలంటే తప్పకుండా ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండుసార్లు బీజేపీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న చాలు లేదా రెండుసార్లు బీజేపీ గుర్తుపై పోటీ చేసినా సరిపోతుందని క్లారిటీ ఇచ్చారు. మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ కూడా బీజేపీ అధ్యక్ష రేసులో ఉంటారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అధిష్ఠానమే నిర్ణయిస్తుందని.. హైకమాండ్ డెసిషనే నైల్ అని తేల్చి చెప్పారు. కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎవరో అందరికి తెలుసని.. అదే బీజేపీ తర్వాత అధ్యక్షుడు ఎవరో బీఆర్ఎస్ చెప్పగలదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్?లో నిర్ణయాలు డైనింగ్ టేబుల్?పై జరుగుతాయని ఎద్దేవా చేసిన కిషన్ రెడ్డి.. బీజేపీలో అలా కాదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి

..మిగతా 2లో



# రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ

### జంటనగరాల్లో చురుకుగా వెరిఫికేషన్ ప్రక్రియ

### కొత్త రేషన్ కార్డు కోసం 83 వేల మంది దరఖాస్తు

2



## సొంత నిధులతో
# ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ

### మరమ్మత్తులు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశం
### దివంగత నేత ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళి

హైదరాబాద్, జనవరి 18 (ప్రభాత ఉదయం): ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ చేరుకున్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడి పోవడం, ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని లోకేశ్ గమనించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను హెచ్ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడికి వచ్చిన ఎన్టీఆర్ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదేనా ఓ మహానేతకు ఇవ్వాల్సిన గౌరవం అంటూ మండిపడ్డారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్టీఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఎంతో బాధపడిన మంత్రి లోకేశ్.. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమత్తు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా, శనివారం ఉదయం నుంచీ ఎన్టీఆర్ ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబసభ్యులు, బంధువులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి దివంగత నేతకు నివాళి అర్పించారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, జూ.ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, లక్ష్మీపార్వతి, ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్రముఖులు వచ్చి ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.



# సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక అడుగు

### సింగపూర్ పర్యటనలో
### పారిశ్రామికవేత్తలతో చర్చలు

హైదరాబాద్, జనవరి 18 (ప్రభాత ఉదయం): సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూల మైన విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి. ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రానికి కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి సహాయపడే అవకాశం ఉంది. సెమీకండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనున్నాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఐఏ చైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చల్లో రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎస్ఐఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. సెమీకండక్టర్ పరిశ్రమల పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిం చారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతారని తెలిపారు.


## 65 లక్షల మందికి
# ఆస్తిహక్కు కార్డులు

మొదటి పేజీ తరువాయి...

తుదకు బ్యాంకులు సైతం దానిపై రుణాలు ఇవ్వడం లేదు' అని ఆయన వివరించారు. 'పూర్వపు ప్రభుత్వాలు దాని గురించి ఏదైనా చేయడానికి చర్యలు తీసుకున్నాయి. కానీ అంతగా ఏదీ జరగలేదు' అని ఆయన చెప్పారు. దళితులు, వెనుకబడిన తరగతులవారు, ఆదివాసీలు దీని వల్ల దారుణంగా నష్టపోయారని మోడీ తెలిపారు. 'చట్టబద్ధమైన ఆస్తి హక్కులు పొందిన తరువాత లక్షలాది మంది ప్రజలు రుణం తీసుకున్నారు. తమ వ్యాపారాలు ప్రారంభించేందుకు వారు ఈ డబ్బు ఉపయోగించు కున్నారు. వారిలో అనేక మంది రైతులు, వారికి ఈ ఆస్తి కార్డులు ఆర్థిక భద్రతకు గ్యారంటీ' అని మోడీ చెప్పారు. స్వమిత్వ, భూ ఆధార్ గ్రామాల అభివృద్ధికి పునాది అవుతాయని కూడా ప్రధాని మోడీ తెలిపారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్', సహాయ మంత్రి ఎస్‌పి సింగ్ భాఘెల్, కార్యదర్శి వివేక్ భరద్వాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు సిఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు వర్చువల్‌గా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నదుల అనుసంధానంతోనే కరువు దూరం

### బనకచర్ల ద్వారా గోదావరి నీటిని తరలిస్తా
### ఎపికి పోలవరం ప్రాజెక్ట్ జీవనాడి
### ఎన్టీఆర్ రాజకీయంగా చరిత్ర సృష్టించారు
### మైదుకూరు పర్యటనలో సిఎం చంద్రబాబు



కడప,జనవరి18(ప్రభాత ఉదయం): నదుల అనుసంధానంతోనే కరవు రహిత రాష్ట్రం సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఏపీ జీవనాడి అని చెప్పారు. గోదావరి నీటిని రాయలసీమకు తరలిస్తామని అన్నారు. కడప జిల్లా మైదుకూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించారు. 'స్వేచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. రెండు సంవత్సరాల్లో పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు. రాయలసీమ రైతులు మీసం తిప్పేలా చేస్తామని అన్నారు. బనకచర్లకు నీళ్లు తీసుకురావడం తన జీవితాశయమని ఉద్ఘాటించారు. వేంకటేశ్వరస్వామి పాదాల వరకు గోదావరి నీరు తీసుకువస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. నేను కూడా రాయలసీమ బిడ్డనే అని గుర్తుచేశారు. నదుల అనుసంధానంతోనే కరవు రహిత రాష్ట్రం సాధ్యమని తెలిపారు.కడప స్టీల్‌ప్లాంట్ కూడా పూర్తి చేస్తామన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ పూర్తిచేసి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ నెల చివర్లోనే వాట్సాప్ గవరెన్స్ తీసుకొస్తామని అన్నారు. గండికోటను టూరిజం హబ్‌గా చేస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాలనలో ఏం జరిగిందో అందరూ చూశారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి చరిత్ర ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగించారు. 'ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం. ప్రభుత్వం అంటే పాలకులు కాదు.. సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు. పేదవాళ్లకు పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీఆర్' అని చంద్రబాబు కొనియాడారు. 'ఈ నెలాఖరులో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొస్తాం. ఏ పని కావాలన్నా ఒక మెసేజ్ పెడితే చాలు. మీ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు వెళ్లే పని లేదు. మీ ముందుకే వచ్చి సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా
# కొత్త రేషన్ కార్డుల జారీ

### జంటనగరాల్లో చురుకుగా వెరిఫికేషన్ ప్రక్రియ
### కొత్త రేషన్ కార్డు కోసం 83 వేల మంది దరఖాస్తు

హైదరాబాద్, జనవరి 18 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇటీవల కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరంలో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను మరింత దృష్టిలో పెట్టుకుని, జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలో 150 డివిజన్లలో దరఖాస్తుదారుల అర్హతల పరిశీలన ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రేషన్ కార్డుల వెరిఫికేషన్ కొనసాగుతోంది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఆదాయం, ఆస్తులు వివరాలు తనిఖీ చేస్తున్నారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల సమన్వయంతో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. రెండు లక్షల లోపు ఆదాయం ఉండి, బిలో పావర్టీ లైన్‌కు దిగువన ఉన్న వారు రేషన్ కార్డు అర్హులు అంటున్నారు. సొంత ఇండ్లు, ఆస్తులు ఉండి కూడా రేషన్ కార్డు కోసం అప్లై చేసుకున్న వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించడం లేదని అంటున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డు కోసం 83 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు, ఈ నెల 20 వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నాటికి అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని, 25వ తేదీకి ఆయా జిల్లా కలెక్టర్లకు నివేదికను అందజేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వం వద్ద ఉన్న డేటాతో సరిచూసి, చివరగా ఈ నెల 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో, జీహెచ్ఎంసీ పరిధిలో 22 లక్షల కుటుంబాల వివరాలను సేకరించింది. ఈ సర్వే అనంతరం కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇందులో 83,285 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. ఇంటింటి సర్వేలో కూడా అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలో కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడం, కార్డుల్లో మార్పులు చేసుకునే అవకాశాలు లేకపోవడంతో వేలాది మంది ప్రజలు కొత్త కార్డుల కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. జీహెచ్ఎంసీ అధికా రులు ప్రాథమికంగా అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నారు. నివేదిక తయారు చేసి, ఈ నెల 26వ తేదీ నాటికి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నారు. ఈ కొత్త ప్రక్రియ ద్వారా రాష్ట్రంలోని అనేక మంది అర్హులైన పేద కుటుం బాలకు రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఇది ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయడంలో సహాయపడుతుంది.

## పెంచి పోషించిన ఉగ్రవాదమే
# పాక్‌ను దహిస్తోంది



### సీమాందర ఉగ్రవాదం
### ఇప్పుడు శాపంగా మారింది
### పాకిస్థాన్‌పై మండిపడ్డ
### విదేశాంగ మంత్రి జైశంకర్

ముంబయి,జనవరి18(ప్రభాత ఉదయం): తాను పెంచి పోషించిన ఉగ్రవాదమే ఇప్పుడు క్యాన్సర్‌లా దహించి వేస్తోందని పాకిస్థాన్‌పై భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మరోసారి విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని 'క్యాన్సర్' వ్యాధితో పోల్చిన ఆయన.. పాక్ పెంచి పోషించిన ఉగ్రవాదం ఇప్పుడు ఆ దేశ ప్రజలనే కబళిస్తోందని విమర్శించారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. దాయాదిపై విమర్శలు గుప్పించారు. ' మన పొరుగున ఉన్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. అదే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. అది క్రమంగా ఆ దేశ రాజకీయాల్లోకీ ప్రవేశిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ సహా పలుదేశాలు కోరుతున్నాయి.' అని జైశంకర్ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి వెనుకబాటుకు తావివ్వకూడదని సూచించారు. పాశ్చాత్య విధానానికి భారత్ వ్యతిరేకమైనప్పటికీ.. వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఆయుధీకరణ విషయంలో భారత్ స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. భారత్‌ను 'విశ్వబంధు'గా అభివర్ణించిన జైశంకర్.. స్నేహాన్ని పెంచుకుంటూ, సమస్యలను తగ్గించుకుంటూ ప్రపంచ వేదికపై భారత్ ఓ నమ్మకమైన భాగస్వామిగా వ్యవహరిస్తోందని చెప్పారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పరస్పర గౌరవం, ప్రయోజనాలు, సుహృద్భావ సంబంధాలు అనే మూడు అంశాలే భారత దౌత్య విధానమని స్పష్టం చేశారు. గత పదేళ్లలో వివిధ దేశాలతో జరిగిన ఒప్పందాలు, ప్రపంచ వేదికలపై భారత్‌కు దక్కిన గుర్తింపే అందుకు నిదర్శనమని చెప్పారు.



## 20 నిముషాల్లో
# ప్రాణాలతో బయటపడ్డా

### షేక్ హసీనా బయటపడ్డ ఘటనపై
### ఆడియో విడుదల

న్యూఢిల్లీ, జనవరి 18 (ప్రభాత ఉదయం): బంగ్లా దేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన ఓ ఆడియో రిలీజైంది. గత ఏడాది ఆగస్టులో ఆమె ప్రాణభయంతో దేశ విడిచి పరారైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ ఆన్‌లైన్‌లో ఆమె ఆడియోను రిలీజ్ చేసింది. తన ప్రాణాలు కాపాడిన అల్లాకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. రాజకీయ ప్రత్యర్థులు తనను చంపేందుకు కుట్ర పన్నినట్లు ఆమె చెప్పింది. సోదరి రెహానాతో కలిసి ఆగస్టు 5వ తేదీన హసీనా ఢిల్లీకి చేరుకున్న విషయం తెలిసిందే. కేవలం 20 నుంచి 25 నిమిషాల తేడాలోనే ప్రాణాలను దక్కించు కున్నానని, ఆగస్టు 21న జరిగిన సజీవంగా ప్రాణాలతో బయటపడిన ఫీలింగ్ కలుగుతున్నట్లు ఆమె వీడియోలో తెలిపారు. కోటలిపారాలో బాంబు దాడి, ఆగస్టు 5, 2024 అటాక్ నుంచి అల్లా తనను కాపాడినట్లు ఆమె చెప్పారు. బంగ్లా భాషలో ఆమె ఆడియో ఉన్నది. 2004, ఆగస్టు 21వ తేదీన హసీనాపై గ్రేనేడ్ అటాక్ జరిగింది. అప్పుడు ఆమె గాయాలతో బటయపడ్డారు. ఇంకా దేశానికి ఏదో చేయాలని అల్లా ఆశిస్తున్నారని, అందుకే తాను ప్రాణాలతో ఉన్నట్లు ఆమె తెలిపారు.తాను తీవ్రమైన బాధలో ఉన్నట్లు ఆ ఆడియోలో తెలిపారు. తనకు దేశం లేదని, ఇళ్లు లేదని, అన్నింటినీ తగలబెట్టేశారని ఆమె పేర్కొన్నారు.



# ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి

మొదటి పేజీ తరువాయి...

అబద్ధాలు చెబుతున్నాడని.. అసలు రేవంత్ రెడ్డి చెబితే ఢిల్లీ ప్రజలకు కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని నిలదీశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. ఉచితాలకు బీజేపీ వ్యతిరేకం కాదని.. కానీ ప్రజలను మోసం చేయకుండా రాష్ట్ర ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని హామీలు ఇవ్వాలని సూచించారు. అలా కాకుండా అడ్డగోలు హామీలు ఇచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయించే పరిస్థితులు తీసుకురావొద్దని సూచించారు. ఇక, నిజామాబాద్?లో కాంగ్రెస్ వల్లే జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు అయ్యిందన్న కాంగ్రెస్ నాయకులను ఈడ్చి కొట్టాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు కిషన్ రెడ్డి.

# సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ముఖ్యం

## శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి



బెలూన్‌లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

బుద్వేల్, జనవరి 18(ప్రభాత ఉదయం): సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి క్రీడలే దోహదం చేస్తాయని, విద్యార్థులు దైనందిన జీవితంలో క్రీడల్ని భాగంగా చేసుకోవాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాలలో మూడు రోజులు పాటు నిర్వహించే నాలుగవ అంతర్ కళాశాలల క్రీడలు, ఆటలు, సంస్కృతిక, వైజ్ఞానిక సమ్మేళనం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .. విశ్వవిద్యాలయంలో చదువుతోపాటు క్రీడలకు సైతం సమాన ప్రాతినిధ్యం ఇస్తున్నామని తెలిపారు. ఇందుకు విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు అన్ని కళాశాలలలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమే అని తెలిపారు. క్రీడలతో జీవితంలో ఆటుపోట్లు ఎదుర్కొనే శక్తి, సామర్థ్యం పెంపొందించబడుతుందని ఈ సందర్భంగా వైస్ ఛాన్స లర్ పేర్కొన్నారు. అటల పోటీల్లో గెలుపోటములు సహజమని ఆటల, పోటీల్లో పాల్గొనడమే విజయం గా భావించాలని డాక్టర్ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. సమాజంలో సక్సెస్ ఫుల్ పీపుల్ చాలా వరకు స్పోర్ట్స్ మెన్ యే నని, ఆటల పోటీలతో పోటీతత్వం పెరుగుతుందని, చదువుల్లో సైతం బాగా రాణిస్తారని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. ఈర్ష, ద్వేషాలకు అతీతంగా, స్పోర్ట్స్ మెన్షిప్ తత్వమే ప్రధాన అజెండాగా క్రీడల పోటీలు జరగాలని ఆయన సూచించారు. తెలంగాణలో సంప్రదాయ ప్రతీకలైన బతుకమ్మ , కోలాటాలు, పేరిణి శివతాండవం నృత్యాలు అంశాల్లో విద్యార్థులు ప్రవేశం కలిగి ఉండాలని, సమగ్ర అవగాహన కలిగి ఉండాలని వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి శారీరకంగా దృఢత్వానికి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఇప్పటినుండి సరైన ప్రణాళికలతో ప్రయత్నం చేయాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు కాలానుగుణంగా వచ్చే నైపుణ్యాలను నేర్చుకోవాలని వివరించారు. విద్యార్థికి నైపుణ్యాలే భవిష్యత్తుకు పునాదులని తెలిపారు. విద్యార్థులు నేర్చుకోవాలని జిజ్ఞాసను పెంచుకొని కొత్త విషయాలను సాంకేతికతను అందిపుచ్చుకొని ఇతరులకు స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాలని పేర్కొన్నారు. ఉద్యాన విద్యతో భవిష్యత్తు లో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. సొంత వ్యాపారాన్ని ప్రారంభించి ఇతరులకు అవకాశాలను అందించవచ్చు అని స్టార్ట్ అప్ ప్రారంభించి, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవచ్చు అని తెలిపారు. విద్యార్థులు నూతన ఆలోచనలకు పదును పెడుతూ కొత్త కొత్త ఆవిష్కరణలను తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్ ఆటల పోటీల మీట్ పై స్వాగత ఉపన్యాసం చేశారు. 5 కాలేజీల నుండి 20 క్రీడాలలో, 18 సాంస్కృతిక పోటీల లో మొత్తం 251 విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, మల్యాల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. చీనా నాయక్, మోజెర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, జోనల్ హెడ్ డాక్టర్ సురేష్ రెడ్డి, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లీజు పొందిన సంస్థల నుంచి ఎకరాకు రూ. 10వేలు వసూలు చేసే ఆలోచన లో వ్యవసాయ విశ్వవిద్యాలయం

బుద్వేల్ జనవరి17(ప్రభాత ఉదయం): నలభై నుంచి 50 సంవత్సరాల క్రితం భారత వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలకు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు లీజు కిచ్చిన వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల లీజు ధరను పెంచి వ్యవసాయ విశ్వవిద్యాలయాభివృద్ధికి వనరులను పెంచుకోవడానికి విశ్వవిద్యాలయ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. అందుకోసం పాలకమండలి చైర్మన్, వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నేతృత్వంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి లీజు కు భూములు తీసుకున్న సంస్థల జాబితాను సేకరించి వారికి లీజు పెంపు పై లేఖలు రాశారు. లీజు పొందిన సమయంలో ఎకరాకు సంవత్సరానికి ఐదు రూపాయలు, పది రూపాయల చొప్పున ఇవ్వడం జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం చుట్టూరా ఉన్న 12 సంస్థలకు 600 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. అందులో నేషనల్ అకాడమీ అఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(నార్మ్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ (ఐఐఓఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్సన్ మేనేజిమెంట్ (మేనేజ్), ఇం డియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్), ఇండియన్ ఇనిసిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్), ఇండియన్ గ్రేయిన్ స్టోరేజ్ ఇనిస్టిట్యూట్ (ఐజీఎస్ఐ), నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్స్ రీసోర్సెస్ (ఎన్బీపీజీఆర్), నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెం ట్(ఎన్ ఐ పీహెచ్ఎం). ప్రాజెక్టు డైరెక్టరేట్ ఆన్ పౌల్ట్రీ (పీడీపీ) పెట్రోల్ బంకు కోసం టీఎస్ అగ్రోస్ సంస్థకు, ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం, టీఎస్ రిమోట్ సెన్సింగ్ ఎజెన్సీ లు ఉన్నాయి.

## నేడు క్యాన్సర్ అవగాహన శిబిరం

బుద్వేల్ జనవరి18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురంలోని మార్కండేయ భవన్ లో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు క్యాన్సర్ పై అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. సర్జికల్ అంకాలజీ విభాగం కు చెందిన డాక్టర్ మధు దేవరశెట్టి బృందంలోని డాక్టర్లు ఈ అవగాహన శిభిరం లో పాల్గొని ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హాజరౌతున్నారన్నారు. పద్మశాలిపురం, కాటేదాన్ పరిసర ప్రాంతాల ప్రజలు క్యాన్సర్ అవగాహన శిభిరానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గూగుల్ మ్యాప్స్ ద్వారా కబ్జాలను గుర్తిస్తాం

## నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



కుత్బుల్లాపూర్ లో దేవదాయ భూములను పరిశీలిస్తున్న హైడ్రాక్ కమిషనర్ రంగనాథ్

కుత్బుల్లాపూర్,జనవరి 18 (ప్రభాత ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే భూ కబ్జాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా గుర్తిస్తామని.. అక్రమణలకు పాల్పడే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.జగద్గిరిగుట్ట వెంకటేశ్వరస్వామి దేవాలయం భూములను కమీషనర్ రంగనాథ్ పరిశీలించారు. దేవాలయ భూములను కబ్జా చేస్తున్నారని స్థానిక రెవెన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవట్లేదని ఈ సందర్భంగా స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కబ్జాలకు పాల్పడుతున్న స్థానిక నేతలపై కేసులు బుక్ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆలయం చుట్టూ ఉన్న భూములు కబ్జా అవుతుంటే ఏం చేస్తున్నారని కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులపై కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవిందరాజుల స్వామి ఆలయం కొలను, గుండం కబ్జా అవుతున్నట్టు పూజారి నరహరి వీడియో చూసి ఇక్కడకు వచ్చామని తెలిపారు. అలాగే ఇక్కడున్న పరికి చెరువు కబ్జాలను కూడా పరిశీలించామని చెప్పారు. కులసంఘాల పేరిట స్థలం కబ్జా చేసి ప్లాట్లు చేసినట్లు కంప్లెయింట్స్ వచ్చాయని.. గూగుల్ మ్యాప్స్ ద్వారా కబ్జాలను గుర్తించి అక్రమణదారులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. హైడ్రా పోలీసు స్టేషన్ కూడా 15 రోజుల్లో పని ప్రారంభిస్తుందని.. కబ్జాదారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కబ్జాలపై నిర్లక్ష్యం వహించిన స్థానిక అధికారులపై ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తామన్నారు. వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు పరికి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటు అయిందని.. అంతకుముందు నిర్మించిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని కమిషనర్ రంగనాథ్ మరోసారి స్పష్టం చేశారు. 2024 జూలై తర్వాత జరిగిన కబ్జాలపై మాత్రమే హైడ్రా యాక్షన్ తీసుకుంటుందని క్లారిటీ ఇచ్చారు.

# వ్యవసాయ వర్శిటీకి నియమితులయ్యే ఉన్నతాధికారులెవరో ?



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

బుద్వేల్, జనవరి18(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నియామకాలకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు గానీ, ఫిబ్రవరి 15వ తేదీలోపు గాని వర్సిటీ కి కొత్త అధికారులు రాబోతున్నారు. ఇంటర్వ్యూల అనంతరం పాలకమండలి సమావేశం నిర్వహించి పాలకమండలి ఆమోదం పొందిన తర్వాత వర్శిటీ నూతన అధికారులను ప్రకటించే ఆవకాశం ఉంది. ఈ విషయమై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జోరుగా చర్చ జరుగుతుంది. ఎవరు యూనివర్శిటీ అధికారులు కాబోతున్నారనే దానిపైనే వర్శిటీలో పనిచేస్తున్న ప్రతి అధికారి, శాస్త్రవేత్త, అధ్యాపకులు, ఉద్యోగులు చర్చించుకోవడం కనిపిస్తుంది. 13 సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో యూనివర్శిటీ అధికారులు లేరు. ఇప్పటి వరకు యూనివర్శిటీ ఆధికారులంత ఇంచార్జులుగానే కొనసాగారు. వర్శిటీ కి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బాధ్యతలు స్వీకరించాక వెం టనే యూనివర్శిటీ ఆఫీసర్ల నియామాకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కు రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు, డీన్ అగ్రికల్చర్, డీన్ పీజీ స్టడీస్, డీన్ కమ్యూనిటీ సైన్స్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్సన్ , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ , యూనివర్సిటీ లైబ్రెరియన్ డీన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ లుగా త్వరలోనే పూర్తి స్థాయి అధికారులు వచ్చే అవకాశం ఉంది. యూనివర్శిటీ అధికారులతో పాటు పలు నామినేటెడ్ పోస్టులు కూడా భర్తీ చేయాల్సి ఉంది. డైరెక్టర్ ప్లానింగ్ అండ్ మానిటరింగ్, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లాంటి పదవులు కూడా ఉన్నాయి. వీటన్నింటిపై ఆశలు పెట్టుకున్న వారు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలుస్తుంది.



# నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, జనవరి 18(ప్రభాత ఉదయం) గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పహాని ఫుడ్ కంపెనీ, ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కొంత ప్రాంతం, మీనా కెమికల్ విద్యుత్ ఫీడర్, శాతం రాయి విద్యుత్ ఫీడర్, మీనాక్షి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శాతం రాయి పారిశ్రామిక వాడ లో విద్యుత్ సరఫరాలో ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సరఫరా అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



షాపూర్ సెక్షన్‌లో విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న సిజిఎం పాండ్యా నాయక్

## ప్రజా విద్యుత్ అవసరాల కనుగుణంగా మౌలిక సదుపాయాలు: సీజీఎం పాండ్యా నాయక్

శంషాబాద్, జనవరి 18(ప్రభాత ఉదయం) విద్యుత్ వినియోగదారుల డిమాండ్కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని టి జి ఎస్ పి డి సి ఎల్ ఆర్ఆర్ జోన్ సిజిఎం పాండ్యా నాయక్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని షాపూర్ సెక్షన్ పరిధిలోగల నర్కూడ, జూకల్ ప్రాంతాలలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా ఏర్పాటుచేసిన నూతన విద్యుత్ ఫీడర్ ను ఆయన రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ శ్రీ రామ్మోహన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిజిఎం పాండ్యా నాయక్ మాట్లాడుతూ... విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ శ్రీరామ్మోహన్ మాట్లాడుతూ ... ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని లక్ష్యంతో ముందుకు వెళుతుందని ఆ దిశలో యాజమాన్యం మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సరఫరా అందించటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ డి ఈ రత్నాకర్ రావు, డి ఈ ( కన్స్ట్రక్షన్) చంద్రశేఖర్, డి ఈ (ప్రొటెక్షన్) భాస్కర్ రావు, శంషాబాద్ సబ్ డివిజన్ ఏ డి ఈ రమేష్, శంషాబాద్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్లు షేక్ బాషా, షాపూర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి లు పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి ఎన్ టీ ఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న టీ టీడీపీ నాయకులు

## ప్రజల గుండెల్లో నేటికి పదిలంగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్

బుద్వేల్ జనవరి18(ప్రభాత ఉదయం):మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రజల గుండెల్లో నేటికి పదిలంగా ఉన్న మహానుభావుడని తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతనిధి మ్యాడం రామేశ్వర్ రావు అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ చౌరస్తాలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మ్యాడం రామేశ్వర్ రావు మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీ స్థాపించిన ఆరు నెలలోనే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన గొప్ప మేధావి ఎన్టీఆర్ అన్నారు. పేదవాణ్ణి కష్టాలను చూసి వాటి పరిష్కారానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందన్నారు. ఆయన ఏ రంగంలో పనిచేసిన ఆ రంగానికి వన్నె తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.క్రిష్ణారెడ్డి, సోమారం రాజ్ కుమార్, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి , ఎం.జయవంత్ రావు , ఎ.బాల్ రాజ్, కె.కొండల్ రెడ్డి, ఆర్.బాలప్ప, ఆంజనేయులు గౌడ్, కె.సోమేశ్ గౌడ్, రాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ గూడ రాజీవ్ గృహ కల్ప లో రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలిస్తున్న అదికారులు

## రాజేంద్రనగర్ సర్కిల్లో రేషన్ కార్డుల పరిశీలన

బుద్వేల్ జనవరి18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 25 మంది అధికారులు రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలో 7112 రేషన్ కార్డు దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 3955 దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ నెల 21లోగా రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉందని అయన తెలిపారు. శనివారం లక్ష్మీగూడ లో జరిగిన రేషన్ కార్డుల పరిశీలన కార్యక్రమంలో మహిళా నాయకురాలు ఎ.శరణమ్మ పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ ఎన్టీఆర్

### ఎన్టీఆర్ 29వ వర్ధంతికి ఘన నివాళి

కొత్తకోట, జనవరి 18(ప్రభాత ఉదయం) టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని చౌరస్తాలో మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎం. కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...తెలుగు రాజకీయాలతోపాటు దేశ రాజకీయాలపైన ఎన్టీఆర్ తనదైన శైలిలో ముద్ర వేశారని అన్నారు. రాజకీయాల్లో అతి తక్కువ సమయంలో పెను సంచలనమే సృష్టించారని . 13 యేళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుంది అన్నారు. ఎన్టీఆర్ రావడంతో రాజకీయాల్లో సినీ నటులకు విలువ పెరిగిందని . ప్రాంతీయ పార్టీలకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని . తెలుగు దేశం పార్టీ అధినేతగా చైతన్య రథంపై ఆయన చేసిన యాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని బిజెపి అద్వానీ మిగతా నాయకులకు రథయాత్రలకు ఎన్టీఆర్ యాత్ర ప్రేరణగా నిలిచింది చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మాజీ ఉపసర్పంచ్ జనార్దన్ సాగర్, జనార్దన్ గౌడ్,యస్. ఈశ్వరయ్య, శ్రీరాములు నాయి,జగ్గన్న,కుల్లాయప్ప, చంద్రమోహన్, భాస్కర్, కానాయిపల్లి శ్రీనివాసులు, తోట సత్యనారాయణ, ఆంజనేయులు, అంజి, కొండన్న, భాస్కర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ నిరంజన్ కు వినతిపత్రం అందజేస్తున్న వీరభద్ర కుల సంఘ ప్రతినిధులు

## వీరభద్రీయ కుల పేర్లను వీరముష్టి, నెత్తికొతలగా ప్రకటించాలని వినతి

హైదరాబాద్, జనవరి 18(ప్రభాత ఉదయం) తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) సంఘం, కేంద్ర కమిటి, జాతీయ వీరభద్రీయ వీరముష్టి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ వీరభద్రీయ కులం పేరును (వీరముష్టి, నెత్తికొతల) గా నోటిఫై చేయాలని సంఘం కేంద్ర కమిటి అధ్యక్షులు కాటపల్లి వీరాస్వామి , జాతీయ వీరభద్రీయ అధ్యక్షులు కాటపల్లి రాజేశ్వర్ రావు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ , కమిటీ సభ్యులకు వినతి పత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటి కార్యనిర్వాహ అధ్యక్షులు మిట్టపల్లి పోచయ్య, ప్రధాన కార్యదర్శి చెవ్వ కొండయ్య, మాజి సలహాదారులు పొన్నాల నరహరి, కోశాధికారి కాటపల్లి రవికుమార్, ఉపాధ్యక్షులు కాటపల్లి ఎల్లయ్య, తుల్ల యాదయ్య గట్టు నరసింహ, కార్యదర్శి కడెం జంగయ్య, వి.వి సిటి ప్రధాన కార్యదర్శి చెవ్వ శ్రీనివాస్ (దుబాయ్), సీనియర్ సభ్యులు కాటపల్లి బిక్షపతి, జాతియ,కేంద్ర సంఘం అధికార ప్రతినిది కాటపల్లి ఎల్లేష్ (ప్రెస్), సహ కార్యదర్శి కాటపల్లి చిన్న టిల్లు,చిక్కడపల్లి ప్రధాన కార్యదర్శి చెవ్వ చిన్న కొండయ్య, వనస్థలిపురం కోశాధికారి కాటపల్లి మహేందర్ జాతీయ కమిటీ కార్యదర్శి పొన్నాల శివరాజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆగుల్ల శంకర్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు,మెడ్చల్ అధ్యక్షులు,ఉమ్మడి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఏకైక వ్యక్తి ఎన్టీ రామారావు

### కూకట్ పల్లి జనసేన పార్టీ నేత ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి,జనవరి 18 (ప్రభాత ఉదయం) ఒక రూపాయికి కిలో బియ్యం అందించి, మద్యపానాన్ని నిర్మూలించిన ఏకక నాయకుడు ఎన్టీ రామారావు అని కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని వసంత నగర్ కాలనీలో గల ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక తారక రామారావు విగ్రహానికి కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్ ,పాదం సూర్యా, పులగం సుబ్బు, బలిజేపల్లి శంకర్రావు, మరియు టిడిపి నాయకులు, అట్లూరు దీపక్ చౌదరి, ఎస్.కె సత్తార్ , అలాగే కాలనీ వాసులు నందమూరి తారక రామారావు అభిమానులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి పరిశీలనలో సమగ్ర వివరాలు సేకరించాలి: కలెక్టర్ సంతోష్



క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 18(ప్రభాత ఉదయం)ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి పరిశీలనలో సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. శనివారం అయిజ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరిపారు. అర్హులైన లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారు, ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. సేకరించిన అంశాలను రిజిస్టర్లలో క్రమపద్ధతిలో నమోదు చేస్తున్నారా? లేదా అని తనిఖీ చేసిన కలెక్టర్,అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ సమగ్ర వివరాలను సేకరించాలని, ఆధార్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తులు, సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరిచూసుకోవాలని అన్నారు.రైతు భరోసా పథకానికి సంబంధించి నలా కన్వర్షన్, భూసేకరణ,లే అవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నెంబర్ల వారీగా పరిశీలించాలని, భూభారతి (ధరణి) పోర్టల్, గూగుల్ మ్యాప్ ల ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ సంతకం ఉన్న పట్టా పాస్ బుక్కులకు సంబంధించి కూడా సదరు భూములలో పంటలు సాగు చేస్తున్నారా లేదా అన్నది క్రాప్ బుకింగ్ వివరాల ఆధారంగా పరిశీలన చేయాలన్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, వాటిని సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించారు. సేకరించిన వివరాలను వెంటదివెంట తప్పులు లేకుండా క్రమపద్ధతిలో రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని, తద్వారా డేటా ఎంట్రీ సమయంలో పొరపాట్లకు అవకాశం ఉండదని అన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన వ్యవసాయహయోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఐజా మండలంలోని సర్వే నంబర్లు 913, 930, 518, వడ్డేపల్లి శివారులోని సాగు చేయని భూములను స్వయంగా పరిశీలించారు. కిష్టాపురం గ్రామం లోని పంచాయితి కార్యాలయాన్ని ఆకస్మిక తనికీ చేసి, కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన కుటుంబాలను గుర్తించే సమయంలో, పాత కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలని అన్నారు. రేషన్ కార్డులలో పేర్ల తొలగింపుతో పాటు కొత్త పేర్లను చేర్చడం వంటివి కూడా చేయాల్సి ఉన్నందున దరఖాస్తుదారుని కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి గందరగోళం, తప్పిదాలకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హుల జాబితాల రూపకల్పనలో ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు జ్యోతి, ప్రభాకర్, ఎంపీడీఓ వెంకటయ్య,జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్, పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, ఆర్.ఐ.లు, ఏఈఓలు, పంచాయతీ సెక్రెటరీ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాల కనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి



### గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 18(ప్రభాత ఉదయం)గద్వాల మున్సిపల్ పరిధిలోని జమ్మిచేడు 5వ వార్డ్ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్, 5వ వార్డు కౌన్సిలర్ శారదా సురేష్ లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని వారు అన్నారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పనులను నాణ్యవంతంగా వెంటనే పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీమన్నారాయణ, నాగరాజు మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటేష్, ఆనంద్, నాగరాజు, నాగులుయాదవ్ తిమ్మోజీ, రాంచందర్, జనార్దన్, మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు అందాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు




కొత్తకోట, జనవరి 18(ప్రభాత ఉదయం) రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డు పథకాలకు నిజమైన అర్హులను గుర్తించే విధంగా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించే సర్వేను శనివారం అదనపు కలెక్టర్ కొత్తకోట మండలం పరిధిలోని అప్పరాల గ్రామంలో తనిఖీ చేశారు. అర్హులైన రైతు కుటుంబాలకు మాత్రమే రైతు భరోసా ఇచ్చేందుకు జి.పి.ఎస్, జియో ట్యగింగ్ యాప్ ల ద్వారా వ్యవసాయ యోగ్యం లేని భూములు అనగా లే అవుట్ ప్లాట్లు, ఇరిగేషన్, రోడ్డు కొరకు సేకరించిన భూములు, ఇప్పటికీ ఇళ్ళు నిర్మించుకున్న స్థలాలు, పారిశ్రామిక స్థలాలను గుర్తించి రైతు భరోసా జాబితా నుండి తొలగించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యే విధంగా ఇప్పటికే రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాను సుపర్ చెక్ చేసి ఎవరైనా అనర్హులు ఉంటే గుర్తించి జాబితా నుండి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొత్త రేషన్ కార్డుల జారికై ఇప్పటికే సిద్ధం చేసిన జాబితాను మరోమారు ఇంటికి వెళ్లి వాస్తవికతను పరిశీలించాలని ఆదేశించారు. సర్వే మొత్తం జనవరి 20 లోపు పూర్తి చేయాలని, సర్వే ఆధారంగా రూపొందించిన జాబితాను జనవరి 21 నుంచి 24 వరకు జరిగే గ్రామ సభల్లో పెట్టి తీర్మానం చేసి లబ్ధిదారుల తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలియజేశారు.తహసిల్దార్, ఎంపీడీఓ, ఇతర అధికారులు అదనపు కలెక్టర్ వెంట వున్నారు.

## వడ్డే ఓబన్న విగ్రహాన్ని చేయడానికి స్థలం కేటాయించాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 18(ప్రభాత ఉదయం)బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడాని కై స్థలం కేటాయించాలని జిల్లా వడ్డెర సంఘం నాయకులు కోరారు. శనివారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ లను వడ్డేర సంఘం సేవా సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కేంద్రంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. వడ్డెర ముద్దుబిడ్డ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు కొరకై స్థలాని కేటాయించాలని కోరుతూ ప్రజాప్రతినిదులకు వినతి పత్రాన్ని అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే, గద్వాల మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించి వడ్డే



ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గద్వాల పట్టణ వడ్డెర సేవా సంఘం నాయకులు, కౌన్సిలర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి

### ఘనంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి,జనవరి 18 (ప్రభాత ఉదయం) తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు తెలుగు నేలపై నిలిచే ఉంటుందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాలు శనివారం కూకట్ పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ఆయన అభిమానులు వాడ వాడల ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధి వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి పతాక తెలుగుజాతి వెలుగు రేఖ నందమూరి తారక రామారావు అని దేశ దేశాలలో ఆయన తెలుగువారికి ఒంటి చేత్తో ఘన కీర్తిని సాధించి పెట్టారని కొనియాడారు. రాజకీయాలకె రాజకీయాలు నేర్పారని రాజకీయాలను పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సంక్షేమానికి వినియోగించిన మహానుభావుడన్నారు. అటు నటనలోనూ ఇటు రాజకీయములను రారాజుగా వెలుగొందిన రామారావు జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం నిజాంపేట్ రోడ్ త్రివేణి నగర్ చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టిడిపి జనార్దన్ , శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ తో తో కలిసి బండి రమేష్ నివాళులర్పించారు.ఈ సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున సర్టిఫికెట్స్ ప్రధానం చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608